


మన
# జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 72 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 09 ఏప్రిల్ 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## 40 రోజుల యుద్ధంతో ఏం సాధించారు

**- కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**




**శ్రీనగర్,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ఇరాన్‌పై 40 రోజుల యుద్ధంతో అమెరికా ఏమి సాధించిందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు సిద్ధంగా ఉండాలనే షరతుపై మధ్యప్రాచ్యంలో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణలో భాగంగా వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచారన్న మీడియా నివేదికలపై బుధవారం ఆయన స్పందించారు. యుద్ధ ప్రారంభం కావడానికి ముందే ఆ మార్గం 'తెరిచి వుండటంతో పాటు స్వేచ్ఛగా అందుబాటులో' ఉందని అన్నారు. ఈ 39 రోజుల యుద్ధం అమెరికా ఏమి సాధించిందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అన్యాయమైన యుద్ధం' అని హ్యాష్ టాగ్ పోస్ట్ చేశారు.

## రాష్ట్ర రెవెన్యూ రంగంలో
# విప్లవాత్మక మార్పు

**భూ యజమానులకు భరోసా**

**1.12 కోట్ల మందికి పట్టాదారులకు పాస్ పుస్తకాలు**

**ప్రతి ఇంటికి రిజిస్ట్రేషన్ చేయించుకునే సౌకర్యం**



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 08:** రాష్ట్రంలో భూ యజమానులకు, పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రెవెన్యూ శాఖపై జరిపిన సమీక్షలో సుమారు 75 లక్షల మందికి ప్రయోజనం చేకూరేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. భూములు విముక్తి నుంచి రిజిస్ట్రేషన్ల సరళీకరణ వరకు సీఎం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రెవెన్యూ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూములు రీసర్వే పక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 2027 మార్చి నాటికి రీసర్వే 2.0 పూర్తి చేసి, 1.12 కోట్ల మంది పట్టా దారులకు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. దీని వల్ల భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను సెక్షన్ 22-ఎజాబితా నుంచి తొలగించాలని నిర్ణయించారు. ఇతర సర్వీస్ ఇనాంలలో ఉన్న మరో లక్ష ఎకరాల భూములకు కూడా విముక్తి కల్పించనున్నారు. ఈ పక్రియను చట్టబద్ధం చేసేందుకు ప్రత్యేకంగా ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మిగతా2లో...



## కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు


**ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ**

**రూ.41,533.81 కోట్లు కేటాయింపు**

**జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బ్జడెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ మిగతా2లో...

## రెండు వారాల పాటు కాల్పుల
# విరమణ: డోనాల్డ్ ట్రంప్



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 08:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై అర్ధరాత్రి జరగాల్సిన దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. రెండు వారాల పాటు కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని తెలిపారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్‌తో చర్చల అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై ఈ రాత్రి జరగాల్సిన దాడులను నిలిపివేయాలని వారు చేసిన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలన్న షరతుకు లోబడి రెండు వారాల గడువు ఇచ్చేందుకు, కాల్పుల విరమణకు అంగీకరించానని ట్రంప్ తెలిపారు. ఇరాన్ నుంచి 10 సూత్రాలతో ఒక ప్రతిపాదన అందిందని.. దానిపై సానుకూలంగా చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఉన్న వివాదాస్పద అంశాల్లో చాలా వాటిపై రెండు దేశాల మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు. ఈ రెండు వారాల వ్యవధిలో తుది ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

**- సిఎంతో భేటీ అయిన**
**టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్**

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ మిగతా2లో...

# యథాతథంగా కీలక వడ్డీరేట్లు

## - ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా



**ముంబై,మన జనప్రగతి ఏప్రిల్ 08:** కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండోసారి కూడా యథాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా వెల్లడించారు. ఈసారి కూడా రెపో రెటులో ఎలాంటి మార్పూ లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. దేశ ఆర్థిక వృద్ధిపై ఆశావహ అంచనాలు వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్, అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్బీఐ రెపో రేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం వరుసగా ఇది రెండోసారి. గత ఫిబ్రవరిలో మిగతా2లో...

## టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

**పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం**

**పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం**

**మంగళగిరి టిడిపి కార్యాలయంలో లోకేశ్**




2లో



## గ్యాస్ సరఫరాలో నిరంతర పర్యవేక్షణ

**పదేపదే తప్పులు చేసే ఏజెన్సీలను ఉపేక్షించం**

**అధికారులతో సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్**

**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 08:** గ్యాస్ సిలిండర్ సరఫరాలో నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయి పరిశీలన అవసరమని ఉన్నతాధికారులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గ్యాస్ బుకింగ్, సిలిండర్ల సరఫరా తదితర అంశాలపై బుధవారం రాజధాని అమరావతిలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మిగతా2లో...

## తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

**వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు త్వరలో శంకుస్థాపన**

**వెల్లడించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 08:** తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

మిగతా2లో...

## హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

**తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి**

**సీఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ**



2లో



## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

**వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**ఏలూరు,మన జనప్రగతి ఏప్రిల్ 08:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థలో మిగతా2లో...

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -04-2026

# టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 08:** కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

# గ్యాస్ సరఫరాలో నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. పదే పదే తప్పులు చేసే ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బ్యాక్ ల్యాగ్స్‌ను ఈ వారంలోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోండంటూ అధికారులకు తెలిపారు. అలాగే కాల్ సెంటర్, ప్రసార మాధ్యమాల్లో వచ్చే సమస్యలపై సైతం దృష్టి సారించాలని వారికి వివరించారు. ఇక రబీ సీజన్‌లో రైతుల ఇబ్బందులకు తావు లేకుండా చూడాలన్నారు. కీలక సమయంలో యంత్రాంగం అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మార్చి రెండో వారంలో పశ్చిమాసియా యుద్ధ పరిణామాల కారణంగా ప్రజల్లో నెలకున్న ఆందోళనల నేపథ్యంలో జరిగిన అధిక గ్యాస్ బుకింగ్స్ బ్యాక్ ల్యాగ్స్ క్రమంగా తగ్గుతున్నాయని.. ఇది మంచి పరిణామం అని చెప్పారు. దీన్ని కొనసాగించేలా.. ఈ వారంలో బ్యాక్ ల్యాగ్స్ అన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని వారిని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చే సమస్యలను గమనిస్తూ, వాటిని పరిష్కరించే ఏర్పాట్లు చేయాలని వారిని కోరారు. ౼ూష్ట్ర వినియోగదారుల కేంద్రం 1965 కాల్ సెంటర్‌కు వచ్చే సమస్యలపైనా దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజూ సమస్యలను పరిశీలన చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. పదే పదే తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సరైన సమయంలో గ్యాస్ డెలివరీ జరగాలన్నారు. ప్రజలను ఇబ్బందులు పెడుతూ వారికి చెందాల్సిన గ్యాస్ సిలిండర్‌ను పక్కదారి పట్టించే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దేపదే తప్పులు చేసే వారిపై, ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్న ఏజెన్సీలపై దృష్టి సారించాలని ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారికి స్పష్టం చేశారు. ఏజెన్సీలను మొదట హెచ్చరించండి.. అప్పటికీ దారిలోకి రాకపోతే మాత్రం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను ఇబ్బందులపాలు చేస్తే మాత్రం చర్యలు తప్పవనే సందేశం ప్రజల్లోకి వెళ్లాలన్నారు. వచ్చిన బుకింగ్‌లు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా ఏజెన్సీలతో జాయింట్ కలెక్టర్లు నిత్యం సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ డెలివరీ విషయంలో ఆల్యసంగా జరుగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. దీన్ని అదిగమించేలా గ్రామీణ ప్రాంతంలోని ఏజెన్సీల వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. రోజువారీ వస్తున్న బుకింగ్స్ ఎంత..? డెలివరీలు ఎన్ని..? గతంలో ఉన్న బ్యాక్ ల్యాగ్స్ ఎన్ని పూర్తి చేస్తున్నారనే అంశాలను ప్రతి రోజూ ఏజెన్సీలు అప్ డేట్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కీలక సమయంలో గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్రం 5 కేజీల గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ 5 కేజీల బండలు అవసరమైన వారికి కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

# హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలంగాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితో పాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని సిఎంను కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయ పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏడాది మార్చిలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతం లో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు జాలర్ల బోట్లను అక్కడ స్థానికులు నిర్బం దించారని పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభు త్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాటుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోం దని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా..?

- అప్పుడే వెళ్లి రైతులను వేధించాలా..?
- హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ



**సంగారెడ్డి,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే అంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# ఉమ్మడి నిజామాబాద్‌లో పులి సంచారం

## - ఆందోళనకు గురవుతున్న సమీప గ్రామాల జనం

**నిజామాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 08:** కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల మధ్య పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. మాచారెడ్డి అటవీ ప్రాంతంలో పులి ఉందన్న సమాచారం స్థానిక గ్రామాల ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. కొన్ని రోజులుగా దోమకొండ, బిక్కనూర్, మాచారెడ్డిలో పులి సంచరిస్తోంది.

గేదెలు, ఆవులను మేపేందుకు పశువుల కాపరులు వెళ్లగా.. ఆయా ప్రాంతాల్లో పశువులపై పెద్దపులి ఒక్కసారిగా దాడి చేస్తోంది. ఆహారం కోసం వాటిని చంపేస్తోంది. భయంతో పరుగులు తీసిన పశువుల కాపరులు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు మాచారెడ్డి అటవీ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు. పులి కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నిరంతర నిఘా పెట్టి దాన్ని పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కెమెరాలకు చిక్కితే అనంతరం బోను ద్వారా దాన్ని బంధిస్తామని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ భయపడవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు అధికారులు. ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు. వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలని తెలిపారు. పులిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని సమీప గ్రామల ప్రజలు సహకరించాలని కోరారు.

# రాష్ట్ర రెవెన్యూ రంగంలో విప్లవాత్మక మార్పు

(మొదటి పేజీ తరువాయి)

2016 కంటే ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీం కింద పట్టాలు పొందిన పేదలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇకపై ప్రతి ఇంటికి రిజిస్ట్రేషన్ చేయించుకునే సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా సదరు ఆస్తులకు అమ్ముకోవడానికి, వారసులకు గిఫ్ట్ డీడ్ రూపంలో ఇవ్వడానికి లబ్దిదారులకు పూర్తి హక్కులు లభిస్తాయి. ఫ్రీ హోల్డ్ కింద అర్హత కలిగిన 9.25లక్షల ఎకరాల భూములపై ఆయా యజమానులకు త్వరలోనే పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు సీఎం ప్రకటించారు. భూ రికార్డుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. అంతేకాదు, రికార్డులను ట్యాంపరింగ్ చేయడానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ఆదేశించారు.

# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. ౼ూజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ ర్గి÷నైర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. ౼ానుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# యధాతథంగా కీలక వడ్డీరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సమీక్షలో కూడా వడ్డీ రేట్లలో ఆర్బీఐ ఎలాంటి మార్పులూ చేయలేదు. కాగా, అంతర్జాతీయ పరిస్థితులపై ఆర్బీఐ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించవచ్చని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నారు. మరోవైపు దేశీయ వినియోగం బలంగా ఉందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు.

# 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన 'మారుతున్న వాతావరణ పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో గోదావరి జిల్లాల్లో కాలువలో కనీసం మట్టి తీయలేదని అన్నారు. గత ఐదేళ్లలో చేసిన రూ. 12 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చామని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భాజపా రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. 17న అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోను న్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారం భం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# ఏపీలో అమానుష ఘటన.. ఆరేళ్ల చిన్నారిపై 60 ఏళ్ల వృద్ధుడి అఘాయిత్యం

**పశ్చిమ గోదావరి జిల్లా,మన జనప్రగతి ఏప్రిల్ 08:** ఏపీలో అమానుష ఘటన చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలంలోని ఓ మేజర్ పంచాయతీలో ఆరేళ్ల చిన్నారిపై 60 ఏళ్ల వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కిరాణ షాపునకు వచ్చిన బాలికపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాధిత చిన్నారి తల్లిదండ్రులు ఆచంట పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చికిత్స, వైద్య పరీక్షల నిమిత్తం చిన్నారిని పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
09 -04-2026

# కర్నూలులో ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం




**పత్తికొండ మన జనప్రగతి ఏప్రిల్ 08:–** మహిళల మనోభావాలను దెబ్బతీసేలా, అసభ్యకరంగా ప్రసారం చేసిన కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ గారు, రాష్ట్ర కమిటీ నాయకులు సుభాష్ చంద్రబోస్, రాంపుల్లయ్య యాదవ్, రామచంద్రారెడ్డి, శశికళ, మాజీ కార్పొరేటర్లు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. “ఇవి కొత్త పలుకులు కావు.. చెత్త పలుకులు” అంటూ నినాదాలు చేస్తూ ఊరూరా ర్యాలీలు నిర్వహించారు. రాధాకృష్ణా ఖబద్దార్ అంటూ హెచ్చరిస్తూ, బాధ్యతాయుతంగా జర్నలిజం చేయాలని కోరారు. రాధాకృష్ణది జర్నలిజం కాదని, ముమ్మాటికీ బ్రోకరిజం అని విమర్శించారు.నిరసనలో భాగంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతులను పలుచోట్ల దహనం చేయడంతో పాటు, రాధాకృష్ణ చిత్రాలతో ఉన్న ప్లకార్డులను కూడా పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఉదయం కర్నూలులోని రాజవిహార్ సమీపంలో ఉన్న ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు

# ఏబీఎన్ రాధాకృష్ణ భేషరతుగా రాష్ట్ర మహిళలందరికీ క్షమాపణ చెప్పాలి: రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 08:–**ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బుధవారం స్థానిక ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెబితే వైసీపీ వారు వారి భార్యలకు సైతం మరో వివాహం చేయిస్తారని వ్యాఖ్యానించడం తమ కుటుంబ విలువలను, తమ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వున్నాయని వివరించారు. కాగా ఆయనను మందలించాల్సిన కూటమి ప్రభుత్వ పెద్దలు ఆ విషయం మరచి గత వైసీపీ వారు మాట్లాడితే ప్రస్తుతం తాము మాట్లాడుతున్నామనడం సరికాదని తెలిపారు. ఆయన అంతటితో పశ్చాత్తాప పడి మహిళలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి తిరిగి వైసీపీ వారు అమరావతి చట్టబద్ధత, నిర్మాణం చూసి ఓర్వలేక, అందుకు సంబంధించిన వార్తలు తాము ప్రచురణ, ప్రచారం చేసినందుకు దాడి చేశారనడం దారుణ మన్నారు. ఇప్పటికైనా రాధాకృష్ణ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పేపర్ ను కడప జిల్లాలో మనుగడలో వుండనీయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

# ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.వెంకటేష్, కార్యదర్శిగా ఏ.రంగారెడ్డి ఎన్నిక



**ఉరవకొండ మన జనప్రగతి ఏప్రిల్ 08:–**ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం మూడవ జిల్లా మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. ఈ మహాసభల సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఏ. రంగారెడ్డి , కోశాధికారిగా (ట్రెజరర్) ఎం. బాల రంగయ్య ఎన్నికయ్యారు.వీరితో పాటు జిల్లా కార్యవర్గంలో మరో 15 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది నూతన కమిటీ సభ్యులుహెచ్. రామాంజనేయులు, ఎం. వెంకటేశు, ఎం. నారాయణస్వామి, వై. సీనప్ప, సి. ఈరమ్మ, రామాంజనేయులు, ధనుంజయ, ప్రభాకర్, సుంకన్న, రామాంజనేయులు, ఎర్రి స్వామి, చౌడమ్మ, అనసూయమ్మ, నరసింహులు మరియు ఎర్రి స్వామి.కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలు, రుణ అర్హత కార్డులు ప్రతి కౌలు రైతుకు అందేలా కృషి చేస్తామని నూతన కమిటీ ఈ సందర్భంగా ప్రకటించింది. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు నాయకత్వానికి, సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్యని కలిసిన విజయ్ వర్మ పాకలపాటి

## గల్లీ క్రికెట్‌ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 08:–** శ్రీలంక పర్యటనలో వున్న సినీ దర్శక నిర్మాత, ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త వీస్ విజయ్ వర్మ పాకలపాటి శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్య ని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తాను త్వరలో ప్రారంభించనున్న గల్లీ అండ్ విలేజ్ క్రికెట్ క్లబ్ ద్వారా గ్రామ స్థాయి నుండి పట్టణాల గల్లీ లలోని క్రికెట్ ఆణిముత్యాలని మరింత మెరుగు పెట్టే కార్యక్రమానికి స్వీకారం చుట్టనున్నానని అందుకు తమ ప్రోత్సాహం కావాలని జయసూర్య కి విజయ్ వర్మ చేసిన విజ్ఞప్తి కి శ్రీలంక క్రికెట్ దిగ్గజం సానుకూలంగా స్పందించడం జరిగిందని , త్వరలోనే రిటైర్ అయిన క్రికెట్ దిగ్గజాలని కలిసి గల్లీ అండ్ విలేజ్ క్రికెట్ క్లబ్ కి స్వీకారం చుట్టనున్నట్లు వర్మ తెలిపారు.

# మిగులు భూములు పేదలకు పంచాలి

**పత్తికొండ మన జనపతి ఏప్రిల్ 08:–** ప్రభుత్వ భూములు కార్పొరేట్ సంస్థలకు పెద్దలకు అప్పచెప్పుతున్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు భూమి పంపిణీ చేయాలని, అసైన్మెంట్ కమిటీ పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ డిమాండ్ చేశారు బుధవారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం పత్తికొండ మండలం మహాసభలు బుజ్జులు అధ్యక్షతన స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్లోని పొట్లపాడు గోవిందు మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మిగులు భూములను బడా కార్పొరేటు, ప్రభుత్వ పెద్దలకు 99 పైసలకే ఎకరా అప్పజెప్తున్న ప్రభుత్వం పేదలకు భూమి పంపిణీ చేయడానికి మనసు ఒప్పడం లేదని ఇది పేదల పట్ల ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్ల భూమిని ఇల్లు లేని నిరుపేదలకు ఇస్తామని ఇల్లు కట్టిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది పేదలకు భూమి ఇచ్చిందో చెప్పాలని వారు ఆయన డిమాండ్ చేశారు సూపర్ సిక్స్ అమలు అర కోరగా ఉందన్నారు పింఛన్ కొరకు అర్హులైన వేలమంది రాష్ట్రంలో




ఉన్నారని కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం ఇప్పటికి సరైన వైఖరితో లేదని అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర కు పాల్పడుతుందని చంద్రబాబు నాయుడు గారు అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర వాటాను 40% ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారని పేర్కొన్నారు, అందరికీ పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు పెండింగ్లో ఉన్నటువంటి ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు . ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 1934 నెల్లూరు జిల్లా ఆలగానిపాడు గ్రామంలో అమరజీ స్వతంత్ర సమరయోధులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారు వ్యవసాయ కార్మిక సంఘాన్ని ప్రారంభించారని తదనంతరంబిశాఖో ప శా ఖలుగా విస్తరించి దేశంలో కోటికి పైగా సభ్యత్వం రాష్ట్రంలో 10 లక్షల సభ్యత్వం జిల్లాలో లక్ష సభ్యత్వం కలిగిన అతిపెద్ద సంఘముగా ఎదిగిందనీ గ్రామీణ పేదల సంక్షేమం కొరకు హక్కుల కొరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి నరసన్న ఉపాధ్యక్షులు శిఖామణి నాయకులు రామాంజనేయులు సిఐటియు జిల్లా నాయకుల వెంకటేశ్వర రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సురేంద్ర సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర వివిధ గ్రామాల నాయకులు బజారి నారాయణ రామాంజనేయులు, వసంత లక్ష్మి, కాసింబి, నాగరత్నమ్మ, లక్ష్మీదేవి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా శిఖామణి కార్యదర్శిగా బుజ్జులు ఉపాధ్యక్షులుగా నరసన్న రామాంజనేయులు సహాయ కార్యదర్శులుగా నాగభూషణం కునిగిరి హంపమ్మ నాగరత్నమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనళ్ల పోస్టుల భర్తీ

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి మన జనప్రగతి ఏప్రిల్ 08:–**జోనల్ స్థాయి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో మరింత పారదర్శకత పెంచే విషయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలోని 4 జోనళ్ల కార్యాలయాలపై ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో కూడా జోనళ్ల స్థాయి పోస్టుల భర్తీకి సంబందించిన నోటిఫికేషన్ జారీ నుంచి ఎంపిక జాబితా ఖరారు వరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రక్రూటుమెంటు బోర్డు (ఏపీఎంఎస్ఆర్బీ ) ద్వారా జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇకపై ఇచ్చే నోటిఫికేషన్ల జారీకి ఈ నిర్ణయం అమల్లోనికి వస్తుందని చెప్పారు. జీరో వెకెన్సీ కింద పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేబడుతున్నందున కొత్త నిర్ణయం ద్వారా త్వరితగతిన నియామకాలు పూర్తవుతాయని, పాదదర్శకత మరింత పెరుగుతుందని మంత్రి వేడిక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.జోనళ్ల కార్యాలయాల ద్వారా. 1 స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్స్, ఫార్మసీ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మెడికల్ రికార్డు టెక్నిషియన్ పోస్టుల భర్తీ జోనళ్ల వారీగా ప్రస్తుతం జరుగుతోంది. జోన్–1, జోన్–2, జోన్–3, జోన్ –4 కింద విశాఖ రాజమహేంద్రవరం, గుంటూరు, కడపలోని కార్యాలయాల కేంద్రంగా సదరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ ఎంపిక జాబితా ఖరారు, కౌన్సెలింగ్ పోస్టింగు ఉత్తర్వుల జారీ ప్రాంతీయ కార్యాలయాల ద్వారానే జరుగుతోంది. ఈ క్రమంలో పోస్టుల భర్తీ తీరుపై పలు సందర్భాల్లో విమర్శలు వస్తున్నాయి. ఈ మధ్యన రాజమహేంద్రవరం జోనల్ కార్యాలయం ద్వారా 310 వరకు నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 12,000 వరకు దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న అర్హతలు, సీనియార్టీ, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించేందుకు 3 నెలల వరకు సమయం పట్టింది.. ఇలా పోస్టుల సంఖ్య అనుసరించి వచ్చే దరఖాస్తుల ప్రకారం ఎంపిక జాబితా ప్రకటించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఈ జోనళ్ల కార్యాలయంలో రికార్డు అసిస్టెంటు నుంచి సూపర్నెంటెండెంట్ల వరకు కలిపి సగటున 15 మంది వరకు ఉంటున్నారు. మరోవైపు. దరఖాస్తుల పరిశీలన కోసం తాత్కాలిక పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీనియర్ అసిస్టెంట్స్,ఇతర ఉద్యోగుల సేవలను పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో రిక్రూటుమెంటు బోర్డు ద్వారానే జోనళ్ల పోస్టుల భర్తీకి సంబంధించిన జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకోవడం ద్వారా అక్కడి అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతోంది. ఉద్యోగుల పదోన్నతులు, ఉద్యోగుల సర్వీసు వ్యవహారాల పరిశీలనకు తగిన సమయం దొరుకుతుంది.రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా.! రిక్రూట్మెంటు బోర్డులో దరఖాస్తుల పరిశీలన దగ్గర నుంచి ఎంపికచేసిన వారి జాబితా ఖరారు వరకు తీసుకోవాల్సిన చర్యలపై బోర్డులో స్పష్టమైన విధానం అమల్లో ఉంది. ఈ బోర్డు ద్వారా రాష్ట్ర సాయి నియామకాలు (మెడికల్ ఆఫీసర్లు, అసిస్టెంటు ప్రొఫెసరు, సైక్రియాటిస్టులు, ఇతర పోస్టులు)



జరుగుతున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆయుష్ హెచ్ ఓ డీ కార్యాలయాల నుంచి ఇండెంట్ల ఆధారంగా రిక్రూటుమెంట్ బోర్డు నోటిఫికేషన్లు జారీచేసి, సదరు పోస్టుల ఎంపిక జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకుంటోంది. ఆన్లైన్ ద్వారా.కౌన్సిలింగ్ నిర్వహించడం పోస్టింగులు ఇవ్వడశీ మాత్రం సదరు హెచ్ ఓడీల ద్వారా జరుగుతోంది. తాజాగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని 482 వైద్యుల నియామకాలు ఇదే విధంగా జరిగాయి. సరిగ్గా అదే విధానాన్ని జోనళ్ల స్థాయి పోస్టుల భర్తీలోనూ అనుసరించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రిక్రూటుమెంటు బోర్డు ద్వారా గత 2024 జూన్ నుంచి మార్చి, 31 2026 వరకు 2,310 నియామకాలు జరిగాయి. త్వరలో బోధనాసుపత్రుల్లో 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ జరగబోతుంది.

# మావిగన్ పై జగన్ వ్యాఖ్యలు చూసి చిన్నపిల్లలు కూడా నవ్వుతున్నారు: మంత్రి నారాయణ

## జగన్ తీరు మార్చుకోకుంటే ప్రజలు క్షమించరు

## బడ్జెట్ అవుట్ రీచ్ పై అధికారులు ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఇన్చార్జి మంత్రి నారాయణ..

**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 08:–** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ‘మావిగన్‘ వ్యాఖ్యలు వింటే చిన్న పిల్లలు కూడా నవ్వుతున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి,కాకినాడ జిల్లా ఇంచార్జి మంత్రి నారాయణ ఎద్దేవా చేశారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతు తెలిపి, అధికారం రాగానే మాట మార్చిన జగన్ నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు.“పార్లమెంట్‌లో అమరావతి బిల్లు పెట్టినప్పుడు రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు సంతోషించారు. కానీ జగన్ మాత్రం తన సైకో మెంటాలిటీతో ‘మావిగన్‘ వంటి విడ్డూరమైన




అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను డైవర్ట్ చేయాలని చూస్తున్నారు.ౌ వైసీపీ నాయకుడు ఒక మాట అయితే వారి లీడర్లు ఇంకో మాట చెబుతున్నారని విమర్శలు గుప్పించారు. జగన్ తీరు మార్చుకోకపోతే ప్రజలు క్షమించరు,“ అని మంత్రి నారాయణ హెచ్చరించారు. గత ప్రభుత్వం మున్సిపల్ నిధులకు సంబంధించిన 3000 కోట్లను ఇతర అవసరాలకు మళ్లించి వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది.నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ 17వ స్థానంలో ఉందని, ప్రస్తుత ఆదాయంలో 93% కేవలం ఉద్యోగుల జీతాలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదాయ వనరులపై దృష్టి సారించి ‘సూపర్ సిక్స్‘ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారని తెలిపారు. అమరావతి గెజిట్ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రాజధాని నిర్మాణం రాత్రింబవళ్లు శరవేగంగా జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ జిల్లా ప్రజల తరపున మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థిక లోటు ఉన్నప్పటికీ డీఎస్సీ మరియు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి యువతకు భరోసా ఇచ్చిందని మంత్రి వివరించారు. ‘తల్లికి వందనం‘, ‘అన్నదాత సుఖీభవ‘, ‘దీపం–2‘ వంటి పథకాల ద్వారా సంక్షేమాన్ని ఇంటింటికీ చేరువ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అనాథ వ్యక్తికి యండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 08:-**

పట్టణంలోని ఒక వర్కింగ్ హాస్టల్‌లో నివాసం ఉంటూ, స్థానిక టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న కర్ల సతీష్ (సుమారు 45) గుండె నొప్పితో అకస్మాత్తుగా మృతి చెందాడు. జీవితాంతం కష్టపడి జీవించిన అతనికి చివరి సమయంలో తనవారు ఎవరూ లేకపోవడం హృదయవిదారకం.ఆధార్ కార్డు ఆధారంగా వరంగల్‌కు చెందినవాడని గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యుల కోసం వారం రోజులపాటు గాలించినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అంత్యక్రియల బాధ్యతను యండిఆర్ ఫౌండేషన్‌కు అప్పగించారు.మానవత్వాన్ని ముందుంచుకున్న యండిఆర్ ఫౌండేషన్ సభ్యులు సతీష్‌ను తమ కుటుంబ సభ్యుడిగా భావిం చి, అన్ని కార్యక్రమాలను నిర్వహించి గౌరవప్రదంగా అంత్య క్రియలు పూర్తి చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజం లోమానవత్వాన్నినిలబెడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## సేవా భావానికి నిదర్శనం-యువజన వికాస సమితి చలివేంద్రం

### మెట్టు కుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభం



**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 08:-**యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ పక్కన, జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, యువజన వికాస సమితి అధ్యక్షుడు విజయ్, కోశాధికారి షణ్ముఖ, జనరల్ సెక్రెటరీ విజయ్ గౌడ్, సెక్రటరీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీరేష్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శంకర్, శ్రావణ్, ప్రభు, విద్యార్థి ఇన్చార్జ్ నవదీప్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చిట్వేలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**చిట్వేలి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** చిట్వేలి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 9వ తేదీన జరుగుతుందని చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కార్యాలయం సభా భవనంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రాదేశిక సభ్యులు హాజరై నిర్ణయించిన అజెండా ప్రకారం మండలంలోని సమస్యలపై చర్చ జరపాలని ఆయన కోరారు.మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కస్తూరి కోటేశ్వర చౌదరి హాజరౌతారని ఆయన ప్రత్యేక కార్యదర్శి మణికంఠ తెలియజేశారు.

## ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడి చేసిన అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలి: ఏపీ ఏంపిఏ డిమాండ్




**మైలవరం మన జనప్రగతి ఏప్రిల్ 08:-** ఏ బి ఎన్ ఆంధ్రజ్యోతి హైదరాబాద్ ప్రధాన కార్యాలయం పై దాడి చేసిన అల్లరి మూకల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్,మైలవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఏం పి ఎ రాష్ట్రకార్యదర్శి పసుపులేటి చైతన్య,ఎన్టీఆర్ జిల్లా బొడ్డు విజయ్ బాబు,జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ లపై దాడులు చేయటం తగదని,వార్తలపై అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కు పిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలి అన్నారు. పత్రికా కార్యాలయాలపై అల్లరి మూకలతో దాడులకు పాల్పడటం అవివేకపు చర్యలు అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన అల్లరి మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దార్ అబ్దుల్ దరియా కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎంపి ఏ జిల్లా జాయింట్ సెక్రటరీ మన్నె సాంబశివరావు, మైలవరం ప్రెస్ క్లబ్ కోశాధికారి మల్లాది తిరుపతిరావు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మట్టా రవి, సీనియర్ జర్నలిస్టులు పరంగి మురళి బాబు, వై .డి. పి.రెడ్డి,తుపాకుల హరికృష్ణ, వేముల జమలయ్య, తమ్ముంద్రు వెంకయ్య పాల్గొన్నారు.


## ఏ.బీ.ఎన్ ఛానల్లో ప్రసారమైన జుగుప్సాకర వ్యాఖ్యలపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 08:-** ఏ.బీ.ఎన్ ఆంధ్రజ్యోతి చానల్‌లో నిర్వాహకుడు రాధాకృష్ణ చేసిన అనుచిత మరియు బాధ్యతారహిత వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ,వైఎస్సార్సీపీ మహిళా నాయకురాలు మాజీ ఎమ్మెల్యే శివ ప్రసాద్ రెడ్డి సతీమణి రాచమల్లు రమాదేవి,మహిళా కార్యకర్తలు అలాగే నాయకురాళ్లతో కలిసి ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు పోలీసులతో మాట్లాడుతూ, మీడియా సంస్థలు ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత అభిప్రాయాలను దురుద్దేశంతో ప్రచారం చేయడం ద్వారా సమాజంలో అపోహలు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం అసహ్యకరమని, అలాంటి చర్యలను ఖండించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైఎస్సార్సీపీ మహిళా విభాగం తరపున ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకున్నామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ప్రజాస్వామ్యంలో మీడియా బాధ్యతను గుర్తుచేస్తూ,నిజాయితీతో,నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.


# సచివాలయ సేవల్లో వేగం పారదర్శకతకు ప్రాధాన్యం

- కోటకాడపల్లె సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** అన్నమయ్య జిల్లా పెద్దమండెం మండలం కోటకాడపల్లె గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఏయే శాఖల కార్యదర్శిలు ఉన్నారు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, వినతులుఫిర్యాదుల పరిష్కార విధానాన్ని కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ విధానం ఖచ్చితంగా అమలు చేస్తే సేవలలో పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతాయన్నారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కరించి, సచివాలయ సేవలు సులభంగా, వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థుల సమస్యలపై ప్రతి సిబ్బంది బాధ్యతతో స్పందించాలని తెలిపారు. భూ రికార్డులు, ల్యాండ్ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, వాటిని సక్రమంగా నవీకరించాలని అధికారులకు సూచించారు. భూ వివరాలు స్పష్టంగా ఉంటే వివాదాలు తగ్గి ప్రజలకు సేవలు సులభంగా అందుతాయని పేర్కొన్నారు.సచివాలయంలోని అన్ని శాఖల వివరాలను డిజిటల్ విధానంలో నవీకరించడంతో పాటు పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన పెంచి అర్హులందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్‌చెరు నియోజకవర్గంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన కాట శ్రీనివాస్ గౌడ్



**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 08:-** నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తన నివాసంలో స్వయంగా అందజేశారు. మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ. 7,29,000 మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు మరియు ప్రజల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అవసరమైన కుటుంబాలకు, ముఖ్యంగా వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం చేరేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమం తమకు ముఖ్యమని ఆయన హామీ ఇచ్చారు. లబ్ధిదారులు తమకు అందిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్




**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 08: –** జిల్లా కు రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై జాయింట్ కలెక్టర్. ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు లతో కలసి సంబంధిత హెచ్‌ఓడిలతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్. డా, ఎస్. వెంకటేశ్వర్ బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా,మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్‌సిఎం ద్వారా మంజూరైన పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలు వంటి కీలక రంగాల్లో మంజూరైన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిపై వారానికొకసారి సమీక్ష నిర్వహించి, ఎటువంటి ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే, పనుల అమలులో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం పొందాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన మంజూరుల వివరాలు, ప్రస్తుత పురోగతి, ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారుఈ సమావేశంలో ఏ ఎస్పి రావిమనోహరచ్చారీ, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్. శివకుమార్, ఇరిగేషన్ డి ఈ, రాధా కృష్ణా, ఆర్ అండ్ బి ఎస్ ఈ, రాజా నాయక్, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సివిల్ సప్లై అధికారి శేషు రాజు, ఏ పి ఎమ్ ఐ పి పి డి చిన్న రెడ్డయ్య, గృహనిర్మాణం శాఖ పి డి, ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ జగదీష్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మధుసూదన్, అటవీ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పత్రిక స్వేచ్ఛను హరించడం వైసీపికి తగదు: జనసేన నేత అతికారి క్రిష్ణ



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 08:-** వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న మీడియాపై దాడులు చేయడం ఆ పార్టీ రాక్షస స్వభావానికి నిదర్శనమని రాజంపేట పార్లమెంట్ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ మండిపడ్డారు. బుధవారం సిద్ధవటంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధాని విషయంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఈ వాస్తవాలను బయటపెడుతున్నందుకే ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ తీరును విమర్శిస్తూ, చేతకాని మాటలు మాట్లాడి పరువు పోగొట్టుకోవద్దని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా భావిస్తామని, అలాంటి మీడియాపై దాడులు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగడం వారి రాక్షస మనస్తత్వాన్ని సూచిస్తుందని మండిపడ్డారు. రాజధాని విషయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజలను పూర్తిగా వంచించిందని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టిందని ఆరోపించారు. ఈ విషయాలపై నిజాలు ప్రచురిస్తున్నందుకే ఆంధ్రజ్యోతి కార్యాలయంపై కక్షగట్టి దాడులు చేస్తున్నారని తెలిపారు. మీడియా సంస్థలపై, విలేకరులపై దాడులు చేయడం అంటే రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనని కృష్ణ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివని, తక్షణమే ప్రభుత్వం స్పందించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎవరైనా సహకరించడం ఇష్టం లేకపోతే మౌనంగా ఉండాలే తప్ప, అసందర్భమైన ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మాట్లాడుతూ పరువు పోగొట్టుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



# కడపలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష




**కడప టౌన్ మన జనప్రగతి ఏప్రిల్ 08:-** కడప జిల్లా కేంద్రంలో భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం సమీపంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. బీసీల హక్కుల సాధన కోసం పార్టీ తరఫున ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు ప్రధాన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా యూత్ కన్వీనర్ కట్ల వెంకట నాగార్జున మాట్లాడుతూ, ప్రభుత్వం బీసీల సమస్యలపై స్పందించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించే రాజకీయాలకు ముగింపు పలకాలని హెచ్చరించారు.ఏప్రిల్ 11న భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సురే నిర్మల యాదవ్, సురే మధు సుధన్ యాదవ్, రమా యాదవ్, అనిల్ కుమార్, గంగాధర్ యాదవ్ (రాయచోటి యువ నాయకుడు), జనార్దన్ యాదవ్, పాల కొండ్రాయుడు, గంగాధర్, ఓం కుమార్ యాదవ్, ఈర్ల నరసింహ యాదవ్, వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండు గంటల్లోనే తప్పిపోయిన మహిళను గుర్తించిన కాకినాడ టూ టౌన్ పోలీసులు

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతమైన చర్యలు**

**సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత..ఎస్పీకి కృతజ్ఞతలు.**



**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 08:-**జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ రెండవ పట్టణ పోలీసులు చురుకుగా స్పందించి, తప్పిపోయిన మహిళ కేసును కేవలం రెండు గంటల్లోనే ఛేదించారు.కాకినాడ శారదాదేవి గుడి సమీపంలోని కనకమహాలక్ష్మి గుడి వీధికి చెందిన ర్యాలి విజయదుర్గ (27) కుటుంబ కలహాల కారణంగా బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఇంటి నుండి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో,ఉదయం 9 గంటలకు ఆమె భర్త రాంకిశోర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.సాంకేతిక నిపుణుల సమన్వయంతో బాధితురాలి స్థానం కేవలం రెండు గంటల్లోనే గుర్తించి, ఆమెను సురక్షితంగా రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.తమ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితురాలిని సురక్షితంగా అప్పగించినందుకు కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీకి, టూ టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, సిబ్బందిని ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్, అలాగే ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ అభినందించారు.

# శ్రీ ఉమేష్ చంద్ర కల్యాణమండపం డెకరేషన్‌కు టెండర్ల ఆహ్వానం

**• జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**

**కడప టౌన్ మన జనప్రగతి ఏప్రిల్ 08:-** పోలీస్ సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన కడప నగరంలోని శ్రీ ఉమేష్ చంద్ర కల్యాణ మండపం అలంకరణ(డెకరేషన్) పనులను 1 ఏప్రిల్, 2026 నుండి 31 మార్చి 2027 వరకు చేపట్టాలని నిర్ణయించినట్లు, పైన పేర్కొన్న కాలానికి అర్హులైన స్థానిక కాంట్రాక్టర్ ల నుండి ఒక అవగాహన ఒప్పందం (వీశీఖ) క్రింద టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంకరణ కాంట్రాక్టర్ల కొరకు ఈ టెండర్ 15.04.2026 న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బహిరంగ వేలం ద్వారా నిర్వహించబడుతుందని జిల్లా ఎస్.పీ గారు తెలిపారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు ఈ నెల 15 న పైన పేర్కొన్న నిర్ణీత సమయంలో బహిరంగ వేలానికి హాజరు కావచ్చని ఎస్.పీ తెలిపారు. ఆలస్యంగా వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. ఇతర వివరాలకు కె.వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్.ఐ. కడప సెల్ నెంబర్ 9121100648 ను సంప్రదించవచ్చు

# సేవా గుణమే మానవత్వానికి ప్రతీక - మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 08:-**స్థానిక ప్రొద్దుటూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు గోవిందమ్మ అనే వృద్ధురాలు మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఈరోజు హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్,ఈశ్వర్ వర్ధన్ రెడ్డి,శ్రీనాథ్,మధన్ రాజ్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్ధులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరుచున్నాము.82972 53484,9182244150.

# ఉపాధి హామీ నిధులపై సామాజిక తనిఖీ

**• 6.36 కోట్ల రూపాయల ఖర్చుపై పరిశీలన**

**• రూ.31 వేల రికవరీకి ఆదేశాలు**




**లింగాల మన జనప్రగతి ఏప్రిల్ 08:-** మండల పరిధిలోని గ్రామాల్లో 202425 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.గత నెల రోజులుగా మండలంలోని గ్రామాల్లో పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, హౌసింగ్ శాఖలకు చెందిన పనులపై మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన రూ.6 కోట్ల 36 లక్షల నిధుల వినియోగాన్ని అధికారులు పరిశీలించారు.ఈ తనిఖీలలో భాగంగా ఎస్ఆర్పీ మీరావలి, డిఆర్పీలు శివప్రసాద్, బాదుల్లా, జయకర్ లు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పరిశీలనలు చేసి నివేదికలు సిద్ధం చేశారు.బుధవారం జరిగిన సమావేశంలో డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి జుబేదాబేగం ఈ నివేదికలను సమీక్షించారు. తనిఖీలలో గుర్తించిన లోపాల నేపథ్యంలో రూ.31 వేల రికవరీకి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో గంగరాజు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# భక్త రామదాసు స్వామి సేవలు చిరస్మరణీయం

**• చెన్నూరులో 16వ సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహణ**






**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 08:-** స్వర్గీయ సద్గురు శ్రీ శ్రీ శ్రీ రామదాసు స్వామి సేవలు చెన్నూరు మండల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని కడప చిన్మయ మిషన్‌కు చెందిన స్వామి వెంకటరమణ, రామదాసు స్వామి శిష్యులు మాధవస్వామి పేర్కొన్నారు.బుధవారం చెన్నూరు సీతారామ నామ సంకీర్తన క్షేత్రంలో స్వామివారి 16వ సంస్మరణ దినోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు హనుమత్ అభిషేకం నిర్వహించగా,అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన స్వామి వెంకటరమణ,మాధవస్వామి మాట్లాడుతూ రామదాసు స్వామి యుక్త వయస్సులోనే సన్యాసం స్వీకరించి దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలను సందర్శించి భక్తి మార్గాన్ని ప్రజలకు బోధించారని తెలిపారు.భగవన్నామ స్మరణ ద్వారానే ముక్తి సాధ్యమని ఆయన విశ్వసించారని వివరించారు.1919లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రామదాసు స్వామి చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకుని అనేక క్షేత్రాలను దర్శించారు. 1984లో రామాలయం, రాధాకృష్ణ భజన మందిరం నిర్మాణానికి భూమి సమకూర్చి విశేష కృషి చేశారు. 2010లో ఉత్తరప్రదేశ్‌లోని బృందావనంలో శివైక్యం పొందినట్లు వక్తలు తెలిపారు.మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టగా, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భగవన్నామ సంకీర్తనలు కొనసాగాయి. చెన్నూరు, కాజీపేట మండలాలకు చెందిన భజన బృందాలు కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు,భక్తులు, భజన బృంద సభ్యులు పాల్గొన్నారు.

# వైవీయూకు జాతీయ ఖ్యాతి తెచ్చిన ఫైన్ ఆర్ట్స్ శాఖ

**ఫేర్‌వెల్ డేలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు శుభాకాంక్షలు**

**జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులన్న డీన్ గంగయ్య**


**జూనియర్ల అభివృద్ధికి సీనియర్లు తోడ్పడాలి:అధ్యాపకుల సూచనలు**





**కడప మన జనప్రగతి ఏప్రిల్ 08:-** యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ)లో ఫైన్ ఆర్ట్స్ శాఖ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఆదర్శ విభాగమని ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య అన్నారు.వైవీయూ ఫైన్ ఆర్ట్స్ శాఖ 13వ బ్యాచ్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమం బుధవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గతంలో చిత్రకళ విభాగం ద్వారా విశ్వవిద్యాలయానికి జాతీయ అవార్డులు లభించాయని గుర్తుచేశారు. చదువు పూర్తిచేసుకుని వెళ్తున్న విద్యార్థులు విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్ఠలను మరింత పెంచేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమకు అందిన విద్య,నైపుణ్యాలను వినియోగించుకుంటూ చిత్ర,శిల్పకళ రంగాల్లో రాణించాలని, అలాగే తమ జూనియర్ల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావు మరియు అధ్యాపకులను అభినందించారు.ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయరావు మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే చిత్రకళ పోటీల్లో తమ విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిభ కనబరిచి బహుమతులు సాధిస్తారని తెలిపారు. సీనియర్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని జూనియర్లు మరింత నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సీనియర్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.సీనియర్ విద్యార్థులు విశ్వవిద్యాలయంలో పొందిన అనుభవాలు, సహకారం, క్రమశిక్షణ గురించి పంచుకున్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో అధ్యాపకులు చదలవాడ వెంకటేష్, బైరవపోగు ఈరప్ప, ఎం. వాసవి, ఎస్. చంటి, కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, సుధాకర్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమిత్తం ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 08:-**మంగళవారం సాయంత్రం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి ప్రొద్దుటూరు నియోజకవర్గం నందు జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరి, ప్రొద్దుటూరు తాజా రాజకీయాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో చర్చించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.ఎస్ ముక్తియార్,తెదేపా మాజీ పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి ఉన్నారు.

# సిద్దవటంలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత.

**ఆటోలో తరలిస్తున్న 6 బస్తాలు స్వాధీనం.**

**నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ హారిక వెల్లడి.**





**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 08:-**తిమండల కేంద్రమైన సిద్దవటంలోని ఆకుల వీధి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై హారిక తెలిపిన వివరాల ప్రకారం, గ్రామంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా 6 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి కడప సమీపంలోని కృష్ణాపురానికి చెందిన సయ్యద్ మహమ్మద్‌ను నిందితుడిగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై హారిక తెలిపారు.

# ముమ్ముడిగుంటపల్లి ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన మురుగునీరు

**- అంటువ్యాధుల భయం**



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 08:-** మండలంలోని శాఖరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ముమ్ముడిగుంటపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి మోటార్ వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు స్తంభించి దుర్వాసన వస్తోందని, దోమల బెడద వల్ల విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని కాలనీ నివాసి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ చల్లాలని వారు కోరారు.దీనిపై పంచాయతీ సెక్రటరీ సంధ్య స్పందిస్తూ.. రెండు రోజుల్లో మురుగునీటిని పూర్తిగా తొలగించి, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ మరియు అబిట్ పిచికారీ చేయిస్తామని హామీ ఇచ్చారు.

# ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన మురళిని కలిసిన కుప్పాల



**సిద్దవటం మన జనప్రగతి ఏప్రిల్ 08:-** కడప ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మురళిని సిద్ధవటం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లాలో గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య ఆర్డీవోను కోరారు.

## వైసిపి అరాచక రాజకీయాలను అణచివేయాలి

**- టిడిపి నేత వెంకట నరసయ్య డిమాండ్**



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ 08:-** రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య బుధవారం ఒంటిమిట్టలో మాట్లాడుతూ..వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి రాజధాని విషయంలో జగన్ రెడ్డి చేస్తున్న ప్రతిపాదనలు నవ్వులపాలు కావడంతో, ఆ పార్టీ నేతలు నిరాశతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయడం సిగ్గుచేటన్నారు.వైసిపి నేతలు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై, రాధాకృష్ణ కుటుంబ సభ్యులపై నీచమైన విమర్శలు చేస్తూ దాడులకు తెగబడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. మాజీ మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అశాంతిని రేకెత్తిస్తున్నారని,అధికారులను కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడటానికి, వైసిపి అరాచకాలను అరికట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి పనులను పరిశీలించిన పిడి



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 08:** జాతీయ ఉపాధి హామీ పథకం పనులను డ్వామా పిడి ఆది శేషారెడ్డి పరిశీలించారు. బుధవారం మండలంలోని రామిరెడ్డిపల్లెలో జరిగే గ్రామీణా విబిజీ రామ్ జీ పథకం పనులను ఆకస్మికంగా డ్వామా పీడీ ఆది శేషారెడ్డి తనిఖీ చేపట్టారు. కూలీలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్ ఎంఎంఎస్ పేస్ హాజరుపై కూడ ఆరా తీశారు. పనులు సక్రమంగా చేసుకొని ఆదాయం పొందాలని కూలీలకు పిడి సూచించారు. కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పలు సమస్యలను పిడి దృష్టికి తీసుకొని రావడం జరిగింది, టెక్నికల్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పిడి వెంట ఎంపిడిఓ కుళాయమ్మ, ఉపాధి హామీ పథకం ఎపిఓ పార్వతి, ఎంసిసి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరవకొండ వీరశైవుల సమస్యలపై మంత్రికి వినతి



**ఉరవకొండ, మన జనప్రగతి ఏప్రిల్ 08:-** ఉరవకొండ నియోజకవర్గంలోని వీరశైవ సమాజ సమస్యల పరిష్కారం కోరుతూ సంఘం నాయకులు రాష్ట్ర ఆర్థిక మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాటిల్ నిరంజన్ గౌడ్, బొజ్జప్ప, చంద్రమౌళి, మఠం వీరేష్, జయప్ప, బసవరాజు, రామ్మోహన్, డిష్ మల్లికార్జున, తిప్పేస్వామి, సుధాకర్ రెడ్డి, దేశాయ్ వీరేష్, ఏరి స్వామి, నీలకంఠ, జంగం సంక్షేమ సంఘం నాయకుడు బండయ్య తదితరులు పాల్గొన్నారు.రుద్రభూమి అభివృద్ధి, కళ్యాణమండపం కోసం నిధులు, రథోత్సవ షెడ్ నిర్మాణం, మఠం ముఖద్వారం ఏర్పాటు, గవి మఠాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి, రోడ్డు విస్తరణ, బసవేశ్వర్ సర్కిల్ ఏర్పాటు వంటి డిమాండ్లను వారు ప్రస్తావించారు.అలాగే వీరశైవులకు బీసీ-డీ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లు రోగులకు ప్రాణ సంకటాలు



**పీలేరు మన జనప్రగతి ఏప్రిల్ 08:-** రోగులకు సకాలంలో స్కానింగ్ రిపోర్ట్ ఇవ్వడంలో నిర్లక్ష్యంపై క్లారిటీ స్కానింగ్ సెంటర్ యాజమాన్యంపై పోలీస్ కేసు నమోదు చేయాలని పీలేరు పోలీస్ స్టేషన్ నందు సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ అందుబాటులో లేకపోవడంతో సబ్ - ఇన్స్పెక్టర్ లోకేష్ కి మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తమ సమీప బంధువైన లక్ష్మి నారాయణ అనే వ్యక్తి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో వైద్యుల సలహా మేరకు (సీటి అబడోమెన్ ప్లయిన్ ) స్కానింగ్ కొరకు పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలో గల క్లారిటీ స్కానింగ్ సెంటర్ కు వెళ్లగా స్కానింగ్ కొరకు 2800 అక్షరాల (రెండు వేల ఏమిది వందల రూపాయలు) చెల్లించుకొని స్కానింగ్ తీశారు స్కానింగ్ రిపోర్టు 1 గంట తరువాత ఇస్తామని అక్కడి సిబ్బంది తెలిపారు వైద్యులను సంప్రదించగా స్కానింగ్ రిపోర్టు చూసి సరియైన చికిత్స అందిస్తామని తెలిపారు ఎంతకీ స్కానింగ్ రిపోర్ట్ ఇవ్వకపోవడంతో అదే రోజు రాత్రి పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించకపోవడంతో చేసేదేమిలేక నేరుగా స్కానింగ్ సెంటర్ కు వెళ్లి సిబ్బందిని అడగగా సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేరని బుధవారం రిపోర్ట్ ఇస్తామని తెలిపారు రోగికి స్కానింగ్ చేసి 12 గంటలు కావస్తుంది రిపోర్ట్ ఇవ్వడంలో ఆలస్యంపై యాజమాన్యాన్ని సంప్రదించగా పొంతన లేని సమాధానాలు తెలిపారని గతంలో కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తూ సకాలంలో రోగులకు స్కానింగ్ రిపోర్టులు ఇవ్వడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్న క్లారిటీ స్కానింగ్ సెంటర్ అనుమతులను రద్దు చేస్తూ రోగుల ప్రాణాల పట్ల ఎటువంటి బాధ్యత లేకుండా సకాలంలో స్కానింగ్ రిపోర్టులు ఇవ్వకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న క్లారిటీ స్కానింగ్ సెంటర్ యాజమాన్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని రోగుల ప్రాణాల పట్ల క్లారిటీ స్కానింగ్ సెంటర్ యాజమాన్య నిర్లక్ష్యంపై పోలీస్ కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పీలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ పాల్గొన్నారు

## రోజా వ్యాఖ్యలకు పులెల రమేష్ కౌంటర్: అనవసర విమర్శలు మానాలి



**రైల్వేకోడూరు మన జనప్రగతి ఏప్రిల్ 08:-** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం, ఎండి రాధాకృష్ణ ఫోటోలను తగలబెట్టే యత్నంపై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పులెల రమేష్ బాబు తీవ్రంగా ఖండించారు. కోడూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ మంత్రి రోజా తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి అగ్ర నాయకుల కుటుంబాలపై అనవసర విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు రోడ్లపైకి వచ్చి ఆరోపణలు చేయడం తగదని సూచించారు.వైసీపీ ప్రభుత్వ కాలంలో మహిళలపై అన్యాయాలు జరిగిన అనేక ఘటనలను ఆయన ప్రస్తావించారు. ముఖ్యంగా దళిత మహిళలపై జరిగిన ఘటనలపై అప్పట్లో సరైన స్పందన రాలేదని విమర్శించారు. రాజమండ్రి, నెల్లూరు, పులివెందుల ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు.అసెంబ్లీలోనూ అగ్ర నాయకుల కుటుంబాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలను ఆయన గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఘటనలపై స్పందించని వారు, ఇప్పుడు ఇతరులపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం అని వ్యాఖ్యానించారు.ఇకపై ఎటువంటి ఆధారాలు లేకుండా ఎన్డీఏ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని, రాజకీయ లాభం కోసం ఇలాంటి చర్యలు మానుకోవాలని రోజాకు సూచించారు.ఈ సమావేశంలో హేమంత్ కుమార్, అమర, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధి నిర్ధారణలో సరికొత్త విప్లవం



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 08:-**వైద్య రంగంలో వ్యాధిని గుర్తించడం అనేది చికిత్స కంటే ముఖ్యం. ఆ విభాగంలో తిరుపతికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ లావణ్య వంజరి అద్భుత ప్రగతిని సాధిస్తున్నారు. అంటువ్యాధుల నిర్ధారణలో ఆమె చేస్తున్న పరిశోధనలు సామాన్యుడికి వైద్యం చేరువయ్యేలా చేస్తున్నాయి. కుటుంబ స్ఫూర్తితో సేవా పథం లావణ్య సేవా దృక్పథానికి పునాది ఆమె కుటుంబమే. సమాజ హితం కోరే మాజీ సైనికోద్యోగి వి. రామకృష్ణమూర్తి కుమార్తెగా, అలాగే ప్రజా క్షేమం కోసం పాటుపడిన దివంగత సురభి నరసింహమూర్తి కోడలిగా.. వారి ఆశయాలను ఆమె తన పరిశోధనల ద్వారా కొనసాగిస్తున్నారు.**చదువు పరిశోధన ప్రస్థానము** తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి సూక్ష్మజీవ శాస్త్రంలో పట్టా పొందిన ఆమె, హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యశాల నుంచి డాక్టరేట్ పూర్తి చేశారు. పదేళ్లకు పైగా పరిశోధనల్లో నిమగ్నమై.. హెచ్.ఐ.వి, క్షయ, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులపై విస్తృతమైన అధ్యయనం చేశారు. ముఖ్యంగా మందులకు లొంగని బ్యాక్టీరియా (యాంటీబయాటిక్ రెసిస్టెన్స్) వల్ల తలెత్తే ముప్పును అరికట్టేందుకు ఆమె నిరంతరం శ్రమిస్తున్నారు.**అంతర్జాతీయ గుర్తింపు - పేదల కోసం ఆవిష్కరణలు** ప్రపంచ ప్రసిద్ధ బెల్జియం దేశపు ఫెలోషిప్ సాధించి, అక్కడ జీనోమ్ సీక్వెన్సింగ్ (జన్యు క్రమ విశ్లేషణ) పై కీలక పరిశోధనలు చేశారు. ప్రస్తుతం ఆమె వద్ద ఒక అంతర్జాతీయ పేటెంట్ ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో, వేగంగా వ్యాధి నిర్ధారణ అయ్యేలా సరికొత్త పరికరాలను ఆమె అభివృద్ధి చేస్తున్నారు.**మాతృభూమిపై మమకారం**ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నప్పటికీ, తన జ్ఞానం సొంత దేశానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో భారతదేశంలోని ఒక నూతన పరిశోధనా సంస్థకు (స్టార్టప్) ఉచితంగా సలహాలు అందిస్తున్నారు. మన దేశంలో అందరికీ నాణ్యమైన వైద్యం అందాలన్నదే ఆమె లక్ష్యం. ముగింపు:శాస్త్రీయ పరిజ్ఞానాన్ని కేవలం ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా, సామాజిక ప్రయోజనంతో ముడిపెట్టిన లావణ్య వంజరి ప్రయాణం ఎందరో యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకం. ఆమె చేస్తున్న కృషి భవిష్యత్తులో ఆరోగ్య రంగంలో మరిన్ని గొప్ప మార్పులకు నాంది పలకనుంది.

## చిన్నమండెం మండలంలో రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

**● కూడళ్లలో అవసరమైన ప్రతి చోట లైటింగ్ ఏర్పాటు చేయాలి ● హైవే కనెక్టివిటీ రోడ్ల కిరువైపులా చెట్లపొదలు తొలగించాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** చిన్నమండెం మండలంలో రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చిన్నమండెం మండలంలో రోడ్డు భద్రత అంశంపై అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి రోడ్డు భద్రత అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఏ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి, లైటింగ్, సూచిక బోర్డులు, కూడలల్లో లైటింగ్ సౌకర్యం ఉందా లేదా, హైవేకు కనెక్టివిటీ రహదారిలలో మరియు మలుపులలో రోడ్డు కిరువైపులా చెట్ల పొదలు పెరిగిన అంశాలు తదితరాలను కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా దాదాపు 40 ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని అధికారులు కలెక్టర్కు వివరించారు. ముఖ్యమైన కూడళ్లలో, మలుపుల వద్ద, స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతంలో సూచిక బోర్డులు, తప్పనిసరిగా లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. హైవే కనెక్టివిటీ గ్రామీణ రోడ్ల కిరువైపులా చెట్లపొదలు తొలగించాలన్నారు. ఇందుకు సంబంధించి రవాణా, పంచాయతీ, విద్యుత్తు, పోలీసు, ఇతర సంబంధిత శాఖలన్నీ సమన్వయంగా కృషిచేసి ప్రమాదాల రహితంగా రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర మా మొర ఆలకించు..

**● వినాయకుడి ఆలయం వద్ద టెంకాయలు కొట్టి**

**● సమస్యలు విన్నవించుకున్న టౌన్ బ్యాంకు ఉద్యోగులు**

**● 14వ రోజుకు చేరుకున్న ఉద్యోగుల నిరసన**



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** గత 11 సంవత్సరాలు గా పిఆర్సి తో కూడిన జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ భారంతో నెట్టుకొస్తూ తమ గోడు స్వామి నువ్వు అయినా పరిష్కరించు అంటూ టౌన్ బ్యాంకు ఉద్యోగులందరూ విఘ్నేశ్వరునికి మొరపెట్టుకున్నారు. తిరుపతి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేపట్టిన నిరసన దీక్ష బుధవారంతో 14వ రోజుకు చేరుకుంది. విఘ్నేశ్వర స్వామి అయిన కరుణించి మమ్మల్ని ఆర్థిక కష్టాల నుండి గట్టెక్కించు స్వామి అంటూ ఆయనకు కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నరసింహ ఆచారి కూడా పాల్గొని సంఘీభావం తెలిపి టెంకాయలు కొట్టారు. అనంతరం మీడియాతో టౌన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సురేష్ బాబు మాట్లాడుతూ 2015, 2022 పి ఆర్ సి లతోపాటు డీఏలను వెంటనే మంజూరు చేయాలని అప్పుడే తాము ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కుతామన్నారు. ఇప్పటికైనా టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయ చంద్రారెడ్డి , పాలకవర్గం మనసు మార్చుకుని స్పందించి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. గత 11 సంవత్సరాలుగా పిఆర్సి అమలు కాకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలై కుటుంబాలను కష్టతరంగా నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరల కారణంగా కుటుంబాలకు సంతృప్తికరంగా పోషించుకోవడం కూడా కష్టంగా మారుతోందని చెప్పారు. ఇప్పటికైనా టౌన్ బ్యాంకు పాలకవర్గం మాపై దయవుంచి కనికరించి వెంటనే పిఆర్సి ఇస్తే మా జీవితాలలో వెలుగులను, సంతోషాలను నింపిన వారు అవుతారని చెప్పారు. పి అర్ సి మా హక్కు... వెంటనే అమలు చేయండి.. అమలు చేయకపోతే బ్యాంకు ఉద్యోగులందరూ కుటుంబ సభ్యులు 1000 మంది దాకా ఇక్కడే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగి తమ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లేంతవరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని యూనియన్ అధ్యక్షులు సురేష్ బాబు పాలకవర్గానికి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ నాయకులు, ఉద్యోగులు శాంతియుతంగా నిరసనలో పాల్గొన్నారు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లకు ఖాతాదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

## ఏబీఎన్ కార్యాలయంపై వైసీపీ దాడి హేయమైన చర్య

**● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం**



తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 08:-ఏబీఎన్ కార్యాలయాలపై మంగళవారం వైసిపి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆపార్టీ నాయకులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తీవ్రంగా ఖండించారు. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు వైసిపి నాయకులు ఏకంగా ఏబీఎన్ కార్యాలయాలపై మూకుమ్మడి దాడికి దిగడం, రాధాకృష్ణ గారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు పాల్పడటం క్షమించరాని విషయమని పేర్కొన్నారు. పత్రికలను భయపెట్టి, బెదిరించి, దాడులు చేసి పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవాలననుకోవడం తగదని అన్నారు. పత్రిక స్వేచ్ఛను అడ్డుకుంటే అది అరాచకాలకు, అవినీతికి, అప్రజాస్వామిక విధానాలకు అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ రాజ్యాంగ పరిరక్షణలో నాలుగవ స్తంభంగా పిలవబడే పత్రికారంగంపై ఇలాంటి దుందుడుకు చర్యలను ఎవరు క్షమించాలని ఇది చట్ట వ్యతిరేక కార్యకలాపాలుగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ తీరుపై ఆత్మ విమర్శ చేసుకోవాలని ఆయన సూచించారు.

# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

### రసాయనాల తగ్గింపు, ఆరోగ్యకరమైన భూమి, జీవన విధానం ముఖ్యం

### డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి

### మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**పశ్చిమగోదావరి జిల్లా/మారుటేరు, మన జనప్రగతి ఏప్రిల్ 08:–** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గంలోని, పెనుమంట్ర మండలం మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పరిశోధన కేంద్రంలోని ల్యాబ్ లను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఆధునిక వరి వంగడాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసని ప్రత్యేక స్టాల్స్ ని పరిశీలించి, వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఆధునిక యంత్రాలను స్వయంగా డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సభలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని, అదే సమయంలో భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణ, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తున్నదని ఆయన వివరించారు. రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పంటలకు మంచి ధర లభించేలా ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు ఆచరించాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నందున మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామ స్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. ఆర్ శారదా జయలక్ష్మి దేవి, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ధనుంజయరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ ఆలపాటి సత్యనారాయణ, మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు టి.శ్రీనివాస్, కోనసీమ, ఏలూరు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య, పెనుమంట్ర తహసిల్దార్ వై.రవికుమార్, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విభాగ అధికారులు, సిబ్బంది, వ్యవసాయ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## వివాహ శుభకార్యానికి తాళిబొట్లు, బట్టలు అందజేసిన యల్లటూరు శ్రీనివాసరాజు




**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 08:–** నందలూరు మండలం, పొత్తపి గ్రామానికి చెందిన వడి శివయ్య దంపతుల కుమారుని వివాహ శుభకార్యానికి తాళిబొట్లు, బట్టలను అందజేసిన యల్లటూరు శ్రీనివాస రాజు అందజేశారు. ఈ సందర్భంగా, తమకు అందించిన సహాయానికి వడి శివయ్య దంపతులు. కృతజ్ఞతలు తెలిపారు. పొత్తపి గ్రామానికి చెందిన యదాల శంకర్ , కరణం శ్రీధర్, మోడం శివకుమార్ మరియు రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు , మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ , పివిఆర్ కుమార్ , పెడకాల సుధాకర్ , మామిళ్ళ రవి , పత్తి నారాయణ, గాజుల కులాయప్ప, బాబు, మౌల , జవ్వాజి రవి పాల్గొన్నారు.

## బోరు పాయింట్ వర్కర్లకు భరోసా కల్పించాలి



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 08:–**బోరు పాయింట్ వర్కర్లకు భరోసా కల్పించాలని ఏఐసిసి టి యు అన్నమయ్య జిల్లా నాయకులు అన్నారు బుధవారం రాయచోటి గాలి వీడు రోడ్ బైపాస్ నందు ఆంధ్రా స్పేస్ హోటల్ లో సదస్సు జరిగింది ఈ సదస్సు బోరు పాయింట్ వర్క్ ర్ వెంకటేష్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా ఏఐసీసీ టి యూ. అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బోరు పాయింట్ వర్కర్లకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ముఖ్యంగా బోర్ వెల్స్ ఓనర్లు బోరు పాయింట్ వర్కర్లను చులకనగా చూడడం అదే విధంగా వర్కర్లకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం చాలా దారుణం అన్నారు అనంతరం బోరు పాయింట్ వర్కర్స్ అన్నమయ్య జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా యన్ అరుణ్ ప్రకాశ్ నాయుడు ప్రధాన కార్యదర్శిగా నవీన్ కుమార్ గౌరవాధ్యక్షులుగా మావులూరి విశ్వనాధ. కోశాధికారిగా సలసింహ ఉపాధ్యక్షులుగా వెంకటేశ్ కలిచర్ల రెడ్డెప్ప సహాయ కార్యదర్శిగా అంజనమ్మ మల్లికార్జున నాయుడు మొత్తం తొమ్మిది మందితో ఎన్నుకోవడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో అన్నమయ్య జలాలలో ఉన్నటువంటి బోరు పాయింట్ వర్కర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

### కుటుంబ సభ్యులతో తరలి వచ్చిన జర్నలిస్టులు

### ఏప్రిల్ 9వ తేది గురువారం కొనసాగునున్న జర్నలిస్టుల హెల్త్ క్యాంప్

### ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గం.లవరకు రక్త పరీక్షలు నిర్వహించబడును




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 08:–** జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య క్షేమం కోసం.. జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల ఉచిత హెల్త్ చెకప్ క్యాంప్‌కు మొదటి రోజు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక చొరవతో.. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో.. బుధవారం కడప రిమ్స్ ప్రాంగణంలోని కేన్సర్ బ్లాకు వద్ద ఏర్పాటు చేసిన రెండు రోజుల జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరానికి జిల్లాలోని అన్నిప్రాంతాల నుండి మీడియా ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. అందులో భాగంగా దాదాపు 150 మందికి పైగా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, వంటి వైద్య విభాగాలకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందించారు. మహిళల కోసం గైనకాలజీ పరీక్షలు, పిల్లల కోసం పీడియాట్రిక్ సేవలు కూడా ప్రత్యేకంగా నిర్వహించారు. అదనంగా కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ), మూత్ర పరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయిలు, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్టులు, థైరాయిడ్, విటమిన్ డి, విటమిన్ బి12,కొలెస్ట్రాల్,ఈసీజీ పరీక్షల వంటి మొత్తం 19 రకాల టెస్టులు నిర్వహించారు. అవసరాన్ని బట్టి ఎంఆర్ఐ, సిటి స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, 2డి ఎకో పరీక్షలు కూడా చేశారు. వైద్య పరిశీలనలో అవసరం అయిన వారికి అందుబాటులో లేని పరీక్షలను ప్రయివేటు ల్యాబ్ ల లో కూడా చేయించేలా రెఫర్ చేశారు.పరీక్షల ఫలితాల ఆధారంగా స్పెషలిస్టులు వ్యక్తిగత ఆరోగ్య సూచనలు,అవసరమైన చికిత్సలను మరుసటి రోజు పూర్తిస్థాయిలో అందించ నున్నారు.కాగా.. జర్నలిస్టుల ప్రత్యేక వైద్య సేవలకు, సదుపాయాలకు ఎలాంటి అంతరాయం లేకుండా రిమ్స్, జిహెచ్‌హెచ్ పరిపాలన అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశారు. అవసరమైన వారికి మందులను సైతం ఉచితంగా అందజేశారు. కాగా జర్నలిస్టులు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన 2 రోజుల వైద్య సేవలను ప్రశంసిస్తూ, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగ పడిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలనే భావనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీనివాసులు, ఐ &పి ఆర్ ఎడి పద్మజ, వివిధ విభాగాల అధిపతులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.ఏప్రిల్ 8,9 తేదీలలో నిర్వహించిన రక్త పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు వచ్చిన జర్నలిస్టులకు ఏప్రిల్ 10వ తేదీ ఉ. 9 గంటల నుండి మ.01 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండి తగిన సలహాలు సూచనలు ఇస్తారు. ఇంకా మిగిలిపోయిన జర్నలిస్టులు క్రింది సూచించిన లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న మెడికల్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

## వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 08:–** స్థానిక నాగమ్మ నగర్ లోని అనాథ ఆశ్రమంలోని అనాథ వృద్ధులకు జనసేనా నేత పోతిరెడ్డి చలపతి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బుధవారం ఇడుపులపాయి జనసేన నేత పోతిరెడ్డి చలపతి తల్లి పోతిరెడ్డి రామలక్షుమ్మ 2 వ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. తన తల్లి వర్ధంతి సందర్భంగా అనాథ వృద్ధులకు సేవా చేయాలనే ఉద్దేశంతో అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ భాధ్యతగా అనాథలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి నిఖిలేంద్ర రాయల్, గుర్రప్ప, కొండయ్య, మారుతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# పదే పదే దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిపై పి.డి చట్టం ప్రయోగించిన కడప జిల్లా పోలీసులు

**కడప మన జనప్రగతి ఏప్రిల్ 08:–**ఆంధ్రప్రదేశ్ అక్రమ సారా వ్యాపారులు, బందిపోటులు, మాదక ద్రవ్య నేరస్తులు, గూండాలు, వ్యభిచార నేరస్తులు మరియు భూకబ్జాదారులు, ప్రమాదకర కార్యకలాపముల నిరోధక చట్టం, 1986 క్రింద సెక్షన్ ఑(1) మరియు ఑ (2) క్రింద ముగురి (03) పై పి.డి చట్టం క్రింద నిర్బంధ ఉత్తర్వులు జారీ కడప మండలం మరియు పట్టణం క్రింద తెలిపిన ముద్దాయిల పై ఆంధ్ర ప్రదేశ్ అక్రమ సారా వ్యాపారులు, బందిపోటులు, మాదక ద్రవ్య నేరస్తులు, గూండాలు, వ్యభిచార నేరస్తులు మరియు భూకబ్జాదారులు, ప్రమాదకర కార్యకలాపముల నిరోధక చట్టం, 1986లోని సెక్షన్ 2 (జి) క్రింద నిర్వచించిన "గూండా" పరిధిలోకి వస్తున్నందున, క్రింద తెలిపిన వారి పై పౌర భద్రతకు (పబ్లిక్ ఆర్డరు) కు ముప్పు వాటిల్లకుండా నిర్బందించు విషయమై తగు ఉత్తర్వు జారీ చెయడమైనది. ముగ్గురు ముద్దాయిల పేర్లు :– కావటి అరుణ భర్త కావటి నాగరాజు, డోర్ నెం. మంగళ వీధి, నగిరిగుట్ట, పులివెందుల ఈమె చట్టాన్ని, గౌరవించకుండా తరచుగా చాలా దొంగతనం మరియు ఆస్థి నేరములకు పాల్పడి, పోలీసు వారిచే అరెస్టు కాబడి, బెయిలు పొంది, మరలా తన 'యొక్క వైఖరిని మార్చుకోకుండా ఆస్థి నేరములను తరచుగా చేయుచున్నది. ఈమె పై కడప మరియు ఇతర జిల్లా లో సుమారు 16 కేసులు నమోదయ్యాయి. తొండ పోసమ్మ, వయస్సు: 42 సంవలు భర్త తొండ పోటురాజు అలియాస్ పోతురాజు, డోర్ నెం. 1–412/25/2, డ్రైవర్స్ కాలనీ, టి.నగర్, గోకవరం మండలం మరియు పట్టణం, తూర్పు గోదావరి జిల్లా . ఈమె చట్టాన్ని, గౌరవించకుండా తరచుగా చాలా దొంగతనం మరియు ఆస్థి నేరములకు పాల్పడి, పోలీసు వారిచే అరెస్టు కాబడి, బెయిలు పొంది, మరలా తన 'యొక్క వైఖరిని మార్చుకోకుండా ఆస్థి నేరములను తరచుగా చేయుచున్నది. ఈమె పై కడప మరియు ఇతర జిల్లా లో సుమారు 27 కేసులు నమోదయ్యాయి. తొండ పోతురాజు అలియాస్ పోటురాజు, వయస్సు: 43 సం॥లు తండ్రి తొండ సత్తిరాజు డోర్ నెం. 1–412/25/2, డ్రైవర్స్ కాలనీ, టి.నగర్, గోకవరం మండలం మరియు పట్టణం, తూర్పు గోదావరి జిల్లా . ఇతను చట్టాన్ని, గౌరవించకుండా తరచుగా చాలా దొంగతనం మరియు ఆస్థి నేరములకు పాల్పడి, పోలీసు వారిచే అరెస్టు కాబడి, బెయిలు పొంది, మరలా తన 'యొక్క వైఖరిని మార్చుకోకుండా ఆస్థి నేరములను తరచుగా చేయుచున్నడు. ఇతని పై కడప మరియు ఇతర జిల్లా లో సుమారు 56 కేసులు నమోదయ్యాయి. సదరు వ్యక్తులు సమాజానికి మరియు సాధారణ ప్రజల యొక్క జీవనానికి హానీ కలిగించుచున్నారు. సదరు వ్యక్తులు చట్టం పట్ల కానీ మరియు శాంతి భద్రతల పట్ల ఎటువంటి గౌరవం లేదు. వారి యొక్క చర్యలు ఆంధ్ర ప్రదేశ్ అక్రమ సారా వ్యాపారులు, బంధి పోటులు, మాదక ద్రవ్య నేరస్తులు, గూండాలు, వ్యభిచార నేరస్తులు మరియు భూకబ్జదారులు, ప్రమాదకర కార్యకలాపముల నిరోధక చట్టము, 1986లోని సెక్షన్ 2 (ఎఫ్) క్రిందకు వచ్చును. పైన తెలిపిన నేరస్థుల పై పి.డి చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా ఎస్.పి. శ్రీ. షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ. (అడ్మిన్,) కె.ప్రకాష్ బాబు , పర్యవేక్షణలో మరియు సి. శంకర్ రెడ్డి ఇన్‌స్పెక్టర్ ఎస్. విశ్వనాథ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎర్రగుంట్ల పర్యవేక్షణలో కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ కి పి.డి చట్టం క్రింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేయమని ప్రతిపాదనలు సమర్పించడమైనది. దాని మేరకు తేదీ 07.04.2026 న పి.డి చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేశారు. దానిని సంబంధిత ముద్దాయిపై అమలు నిమిత్తం సెంట్రల్ జైలు అధికారులకు అందచేయడం జరిగినది. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపములు నిర్వహించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుని, పీడీ యాక్ట్ మరియు జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారుపైన తెలిపిన నేరస్థులుని అరెస్టు చేసి పి.డి చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు పొందుటకు కృషి చేసిన సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, అభినందించారు.




## చంద్రబాబు ప్రభుత్వ రంగానికి వ్యతిరేక: కేవీ రమణ

**ఉరవకొండ మన జనప్రగతి ఏప్రిల్ 08:–** చంద్రబాబు ప్రభుత్వ రంగానికి వ్యతిరేకంగా, ప్రైవేట్ రంగానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కేవీ రమణ విమర్శించారు. జీవో నెం.91 ద్వారా గ్రామపంచాయతీ కార్యదర్శుల బేసిక్ వేతనం ₹28,280గా నిర్ణయించి, తరువాత జీవో నెం.60తో ₹25,220కు తగ్గించడం అన్యాయమని అన్నారు. ఈ నిర్ణయం వల్ల కార్యదర్శులకు ఆర్థిక భారం పెరిగి, సేవలపై ప్రభావం పడుతుందని తెలిపారు. గతంలో కూడా ప్రభుత్వ ఉద్యోగాలపై ప్రతికూల వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు విధానాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. జీవో నెం.60ను వెంటనే ఉపసంహరించుకుని ఉద్యోగుల హక్కులను కాపాడాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తప్పవని హెచ్చరించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -04-2026

# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి: మంత్రి సవిత

**అమరావతి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటో ందన్నారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసాయంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఇప్పుడు



ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయుల పేదరికాన్ని పారదోలడానికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

**ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు పెద్దపీట**

దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఎ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు.

**యువతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం**

ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ల కంటే పారిశ్రామికవేత్తలుగా తోటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్ రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మానం

### మనం మంచి చేశాం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు

### కష్టాల్లో తోడున్న కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా...

### మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడమే మన లక్ష్యం: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 08:**పులివెందుల నియోజకవర్గ కౌన్సిలర్లకు,సర్పంచులకు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన ఘనంగా సన్మానించి,వారి సేవలను కొనియాడారు.సన్మాన సభలో ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో లేకపోయినప్పటికీ గత రెండేళ్లుగా ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా అదరక బెదరక వైఎస్సార్‌సీపీ జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని భావోద్వేగంగా పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.జగనన్న హయాంలో గ్రామ స్థాయిలోనే సచివాలయాలు,ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల ద్వారా పాలనను ప్రజల చెంతకు చేర్చాం అని మనం ప్రజలకు మంచి చేశాం కాబట్టి ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు అని ధీమా వ్యక్తం చేశారు.గతంలో 8 టీఎంసీలకే పరిమితమైన గండికోటలో జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక దాదాపు 1000 కోట్ల



రూపాయలు ఖర్చు చేసి 26 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని తెలిపారు.గతంలో4నుండి 5 టీఎంసీల నీటి నిల్వకే పరిమితమైన చిత్రవతిలో 240 కోట్ల రూపాయలతో పునరావాస ప్యాకేజీ పూర్తి చేసి,ప్రస్తుతం 10 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నామని వివరించారు.మనం ప్రజలకు మంచి చేశాం కాబట్టి ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ పులివెందులలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ (25 కోట్లు),హాకీ స్టేడియం,ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరియు మెడికల్ కాలేజీ వంటి అద్భుతమైన వసతులను నేటి ప్రభుత్వం వినియోగించుకోలేకపోతోందని విమర్శించారు.అమరావతి పేరుతో భారీగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు.ఆరోగ్యశ్రీ బకాయిలు,ఫీజు రీయింబర్స్‌మెంట్,పంట బీమా వంటి ప్రజా ప్రయోజన పథకాలకు నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.మొక్కజొన్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలోనూ ఈ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.రాబోయే స్థానిక సంస్థల





ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలంతా ఏకతాటిపై నిలబడి వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు.ఎన్ని బెదిరింపులు వచ్చినా పార్టీ వెంటే నిలిచిన మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులోనూ మీకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్లు,ఎంపీపీలు, జెడ్పీటీసీలు,సర్పంచులు మరియు పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జలధారజలహారతి కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలి

### ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పిద్దాం: జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 08:-** రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల అనంతపూర్ జిల్లాలో ప్రారంభించిన జలధారజలహారతి, నీటి సంఘాల బాధ్యత కార్యక్రమంను జిల్లాలో సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని మిని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల, ఎంపీడీ ఓ లు ఇరిగేషన్ సిబ్బంది, వి ఏ ఓ లు, డ్వామా, హార్టికల్చర్, ఆర్ డబ్ల్యు ఎస్, ఏ పి ఎమ్ లు,మున్సిపల్ కమిషనర్లు, తదితర అధికారులతో వర్చువల్ గా జిల్లాలో జలధార – జల హారతి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార జలహారతి కార్యక్రమం రాబోయే 45 సంవత్సరాలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జలధార నమూనాను ఉదాహరణగా తీసుకొని, ప్రతి చెరువు, కాలువ, వాగులను పరస్పరం అనుసంధానం చేసి వర్షపు నీటి ప్రతి బొట్టును సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకుని బేసిన్ స్థాయిలో శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లయితే భూగర్భ జలాల స్థాయి గణనీయంగా పెరుగుతుందని, తద్వారా సాగుభూమి విస్తీర్ణం పెరిగి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. పశుసంవర్ధక రంగం, పాల ఉత్పత్తి విస్తరిస్తుందన్నారు. విద్యుత్ వినియోగం తగ్గి ప్రభుత్వానికి వ్యయభారం తగ్గుతుందని తెలిపారు. గ్రామీణ వలసలు తగ్గి స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జలధారజలహారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మొదట ప్రాధాన్యత గల పనులను గుర్తించి, దశలవారీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయి కమిటీలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ చైర్మన్ గా వ్యవహరించగా పంచాయతీ కార్యదర్శి కన్వీనర్ గా వ్యవహరించగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ది అమలు బాధ్యత అని అన్నారు. వీఆర్వో, అగ్రికల్చర్ & హార్టికల్చర్ అసిస్టెంట్లు సభ్యులు గా, నీటి సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులు గా ఉంటారని గ్రామ స్థాయిలో పనుల గుర్తింపు, అమలు, పర్యవేక్షణ బాధ్యత ఈ కమిటీకి ఉంటుందని తెలిపారు. మండల స్థాయి కమిటీ లో ఎంపీడీవో చైర్మన్ గా వ్యవహరించగా తహసీల్దార్ సభ్యుడు గా ఉంటారని, మండల అగ్రికల్చర్ అధికారి, హార్టికల్చర్ అధికారి, ఇరిగేషన్ శాఖ ప్రతినిధి, ఏపీవో (ఉ=ఉూ) కన్వీనర్ గా ఉంటారన్నారు. ఈ కమిటీ మండల స్థాయిలో సమన్వయం, పనుల పురోగతి సమీక్ష, సాంకేతిక మార్గదర్శకత్వం చూసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరిస్తారని, జాయింట్ కలెక్టర్లు సభ్యులు గా, ఇరిగేషన్, వ్యవసాయం, హార్టికల్చర్, పంచాయతీరాజ్, ఉ=ఉూ, రెవెన్యూ శాఖల అధికారులు సభ్యులు గా ఉంటారన్నారు. ఈ కమిటీ జిల్లా స్థాయిలో ప్రణాళిక, నిధుల వినియోగం, సమగ్ర పర్యవేక్షణ బాధ్యత ఈ కమిటీ ది అన్నారు. ఇటీవల ఎన్నికైన నీటి సంఘాల




ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పరిస్థితులపై వారి అవగాహనను ఉపయోగించుకోవడం ద్వారా పనుల ఫలితాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.చెరువుల ప్రస్తుత స్థితి, నీటి నిల్వశాతంఅవసరమైన పనుల గుర్తించి చెరువులను వివిధ శ్రేణులుగా వర్గీకరించి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మండల కార్యాలయాల్లో కాకుండా చెరువుల వద్దే ఫీల్డ్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, రైతులతో ప్రత్యక్షంగా చర్చలు జరపాలని సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలు బ్యాక్ ఎండ్ సపోర్ట్ అందించాల్సిన అవసరం ఉందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో నీటి వనరుల సంరక్షణతో పాటు స్థిరమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఇరిగేషన్ డి ఈ, రాధా కృష్ణా, ఎస్ శివారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవి, డ్వామా పిడి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పిడి శోభన్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, ఏ పి ఎమ్ ఐ పి పి డి చిన్న రెడ్డయ్య, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మధుసూదన్, పాసు సంవర్ధక శాఖ అధికారి రవి కుమార్, విద్యుత్ శాఖ, భూగర్భ శాఖ అధికారి సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం సర్కిల్‌గా నామకరణం చేయాలి

### - బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 08:-** కడప నగర అల్మాస్ పేట సర్కిల్ కు పేరు మార్చాలని ప్రతిపాదన వస్తే ఆ సర్కిల్ కు దేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు నామకరణంగా ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్ డిమాండ్ చేశారు. ఆమేరకు నగరపాలక సంస్థ కమిషనర్‌ను బొమ్మన విజయ్ ఆయన చాంబర్లో కలిసి వినతి పత్రం అందజేశారు.బుధవారం అయన మీడియాతో మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అల్మాస్ పేట సర్కిల్ టిప్పు సుల్తాన్ సర్కిల్ గా మార్చాలనుకోవడం సరి అయింది కాదన్నారు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహర్షిం చుకోకపోతే పెద్ద ఎత్తున బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమానికి తెరదిస్తామన్నారు. నగర అభివృద్ధిని పట్టించుకోకుండా సర్కిల్ లకు పేర్లు మార్చడం అనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు అసలే ఎండాకాలం దాహార్తితో ప్రజలు అల్లాడుతుంటే సర్కిల్ పేర్లు మార్చడం మతలబ్ ఏమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



**వీరబల్లి మన జనప్రగతి ఏప్రిల్ 08:-**రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.బుధవారం వీరబల్లె మండలం నందు పర్యటిస్తూ గ్రంధె వాండ్లపల్లె,పిచ్చిగుంట పల్లె గ్రామాల్లో నూతన బోర్ల కొరకు అధికారులు,తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యకు సంబంధించి పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నూతన బోర్లు వేయిస్తున్నట్లు చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉన్నామని,ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని చమర్తి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పైన తనను సంప్రదించవచ్చునని,ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చమర్తి జగన్ మోహన్ రాజు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల స్థాయి అధికారులు మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు: వైసిపి నాయకులు

**కడప మన జనప్రగతి ఏప్రిల్ 08:-** వైయస్ఆర్‌సీపీ మనోభావాలను దెబ్బతీసేలా, మహిళలను అవమానించేలా తప్పుడు దురుద్దేశపూరిత వార్తలు ప్రచురించిన రాధాకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని వైయస్ఆర్‌సీపీ నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు.కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజాద్ భాష, సీఈసీ సభ్యులు కే. సురేష్ బాబు. జై చంద్రారెడ్డి. రాష్ట్ర విభజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమైర్ షఫీ జులైద్దదితరులు కంప్లైంట్ ఫిర్యాదు నమోదు చేశారు. ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ, మహిళల గౌరవాన్ని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.ఇప్పుడు చెప్పండి నారా చంద్రబాబు నాయుడు ఇలాంటి దుర్మార్గపు జర్నలిజంపై మీ వైఖరి ఏమిటి? మహిళల గౌరవాన్ని కించపరిచిన వారిపై మీరు చర్యలు తీసుకుంటారా, లేక మౌనం వహిస్తారా?ఇలాంటి నీచమైన, బాధ్యతారహితమైన ప్రచారాన్ని మీరు సమర్థిస్తారా?మహిళల గౌరవాన్ని కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకునే ధైర్యం మీకు ఉందా, లేక రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహిస్తారా?ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, జిల్లా మరియు నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174